భోగి మంటలు.. పండగ వెలుగులు!

నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఆయా కాలనీలు, అపార్ట్‌మెంట్ల వద్ద సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో భోగిమంటలు వేసి చుట్టు ప్రదక్షిణాలు చేశారు. చిన్నారులతో భోగి మంటలతో ఆవు పేడతో చేసిన పిడకలు వేయించారు. కుటుంబ సమేతంగా భోగి మంటలు వేసి ఉత్సాహంగా గడిపారు.

– కుత్బుల్లాపూర్



ఎస్‌సీఎల్ నార్త్ కాలనీలో భోగి మంటలు వేసిన బీజేపీ అసెంబ్లీ కో.కన్వీనర్ పోతుర్తూరి శివాజీరాజు



దూలపల్లిలోని శ్రీచైతన్య స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



పద్మానగర్ ఫేజ్-1 గాయత్రి అపార్ట్‌మెంట్‌లో భోగి మంటలు

వైభవం.. గోదాదేవి కల్యాణం.!





సూరారంకాలనీ వాసుదేవ ఆశ్రమంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి సింహాచలం శ్రీధరాచార్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదపండితులు కందాల వంశీకృష్ణమాచార్యులు, కార్తీక ఆచార్యులు వేదమంత్రాల మధ్య కల్యాణం కనుల పండువగా జరిగింది. గోదాదేవి, రంగనాథస్వాముల ఎదుర్కోలుతో ప్రారంభమై కంకణాధారణ, జీలకర్ర బెల్లం, మాంగళధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కడురమణీయంగా సాగింది. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బ్రహ్మానందరావు, వకులాదేవి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– సుభాష్‌నగర్

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

జగద్గిరిగుట్ట: పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ఆరోగ్యాన్ని ప్రసాదించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని మాజీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గూడ వరమ్మ అన్నారు. జగద్గిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో తన పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ నేతలు ఐలయ్య, సాయిప్రవీణ్‌గౌడ్ మహేష్ తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు



నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో కబ్జారాయుళ్ల పన్నాగానికి చెక్ పెట్టాడు. గత రెండ్రోజులుగా సెలవురోజులు అయినప్పటికీ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. సోమవారం గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వే నెంబర్ 342 ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు.

డంపింగ్‌యార్డును తరలించండి

అప్పటి వరకు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించండి

- ప్రతిరోజూ 120 టన్నుల చెత్త
- చెత్త ఆటోలతో ట్రాఫిక్ జామ్
- చెత్తను తొలగించాలని స్థానికుల డిమాండ్



నిలిచిన చెత్త ఆటోలు



చెత్త ఆటోలు వెల్లలేని పరిస్థితి



డిసెంబర్ 19న సాక్షిలో చెత్త సమస్యపై ప్రచురించిన కథనం



స్థానికులు ఆందోళన చేస్తున్న దృశ్యం

నిజాంపేట్: మన ఇంటితో పాటు మన చుట్టు ఉన్న పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలి. అప్పుడే అందరి ఆరోగ్యం బాగుంటుంది. వర్షాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశాలు మెండుగా ఉంటాయి. అలాంటి సమయంలోనైనా అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు కాలనీల్లో పర్యవేక్షణ నిర్వహించాలి. ఎక్కడి చెత్త అక్కడే గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీసీబీకి రెండు సార్లు జరిమానా విధించినా..

◆ నిజాంపేట్ డంపింగ్ కేంద్రంలో చెత్త పేరుకుపోవడంతో చుట్టు పక్కల కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డు తరలించాలని కోర్టు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదేశించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో పీసీబీ కార్పొరేషన్‌కు రెండు సార్లు జరిమానా విధించింది. చెత్త డంపింగ్ యార్డును ఎత్తేయడం పక్కన పెడితే.. ప్రస్తుతం అక్కడే ఉన్న నిల్వ ఉన్న చెత్తతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు మూడు నెలలుగా నిలిచిన చెత్త అక్కడే నిలిచిపోయింది. అధికారులు మాత్రం అటు వైపు చూడనే చూడటం లేదు.

పేరుకుపోయిన చెత్తతో తీవ్ర దుర్గంధం..

◆ ప్రతిరోజు నిజాంపేట్ నుంచి జవహర్‌నగర్‌కు తరలించాల్సిన చెత్తను నెలల తరబడి ఇక్కడే ఉంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీరోజు వచ్చే చెత్త ఆటోలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతిరోజు 120 టన్నుల చెత్తను ఇక్కడ వేయాల్సి ఉంది. కానీ ఇక్కడ చెత్త వేయడానికి స్థలం లేదు. చెత్త ఆటోలు రోడ్డుపై నిలవడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. పేరుకుపోయిన చెత్తతో తీవ్ర దుర్గంధం నెలకొంది. అక్కడ చెత్తవేయడానికి వచ్చిన ఆటోలను స్థానికులు అడ్డుకున్నారు.

ఇప్పటికైనా స్పందిస్తారా.?

◆ ఇక్కడి చెత్త తరలించే వరకు చెత్త వేయొద్దని.. డంపింగ్‌యార్డ్‌ను శాశ్వతంగా ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా... గతంలో 'సాక్షి' దినపత్రికలో కథనాలు వచ్చిన అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదాపై హర్షం

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల అటానమస్ స్టేటస్ (స్వయం ప్రతిపత్తి) సాధించి 2025-26 విద్యా సంవత్సరం నుంచి అకాడమిక్ ఎక్సలెన్స్‌లో అడుగు పెడుతోందని కళాశాల ప్రిన్సి పాల్ కూర రఘువీర్ తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల 1973లో వందమంది విద్యార్థులతో ప్రారంభమై ఇప్పుడు 17వందల మంది విద్యార్థులకు చేరుకుందని, 2023లో 3వ సైకిల్‌లో 3.27 స్కోర్ సాధించి ఎస్ఏఏసీచే ఎప్లస్ గ్రేడ్‌తో గుర్తింపు పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 25-26 విద్యా సంవత్సరం నుంచి 10 సంవత్సరాల కాలానికి ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లేఖను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇంతటి విజయాన్ని సాధించినందుకు కళాశాల సెక్రటరీ చల్లా ప్రసన్నకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యేక రైళ్లను నడపాలి

లిబర్టీ: హైదరాబాద్ మహానగరం నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడిపితే భక్తులకు ఎంతో మేలు కలుగుతుందని సనాత ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ అన్నారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళా జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరం నుంచి లక్షలాదిమంది భక్తులు వెళ్లే అవకాశం ఉన్నందున రైల్వే శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరిగే కుంభమేళా దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు ముందస్తు ప్రత్యేక రైళ్లు నడిపి భక్తులకు సహకరించాలని అన్నారు. హైదరాబాద్ మహానగరం నుంచే కాకుండా తెలంగాణలోని 33 జిల్లాల నుంచి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తారని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చొరవ చూపాలని ఆయన రైల్వే అధికారులను కోరారు.

'వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక ఇవ్వొద్దు'

లిబర్టీ: ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక ఇవ్వకూడదని మాల మహానాడు జాతీయ సలహాదారుడు వి.కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. వర్గీకరణ సాకుతో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఎస్సీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. సోమవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ షమీం సారథ్యంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ అభిప్రాయ సేకరణ చేస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా కమిషన్ నివేదికనిస్తే సహించబోమని హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చెల్లదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్ ఎందుకు వేసిందని కృష్ణస్వరూప్ నిలదీశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల్లో మళ్లీ చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వర్గీకరణ వాదనకు స్వస్తి చెప్పి రాజ్యాంగ హక్కులకై దళితులు పోరాటం చేయటానికి ఏకం కావాలన్నారు.

'లక్షగొంతులు, వేయిడప్పుల' పేరిట పతంగుల ఆవిష్కరణ

రాయదుర్గం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రంతోపాటు చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా 'లక్ష గొంతులు, వేయిడప్పుల' కార్యక్రమం పేరిట ప్రత్యేక పతంగులను తయారు చేయించారు. వాటిని రాయదుర్గంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్యాంలెట్ గణేశ్‌మాదిగ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రచారం చేసేందుకే ఈ పతంగులను రూపొందించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్థాని క ఊరపోచమ్మ ఆలయం వద్ద ఈ పతంగులను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, నాయకులు త్రినాథ్, మహేశ్, బాలు పాల్గొన్నారు.

యువతిని ఢీ కొట్టిన కారు

మణికొండ: రోడ్డు ఎత్తుగా ఉండటంతో అదుపుతప్పిన కారు స్కూటీపై వెళ్తున్న ఓ యువతిని ఢీ కొట్టింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హుడా కాలనీలోని లైట్ అండ్ లైట్ వద్ద భాగ్యలక్ష్మి కాలనీ వైపు నుంచి వచ్చిన మారుతి బ్రీజా కారు వచ్చింది. ఓపెన్ జిమ్ వద్ద ఓ మహిళ కారును నడుపుతూ, స్కూటీపై వస్తున్న ఎంప్లాయిస్ కాలనీకి చెందిన గాయత్రిని ఢీకొట్టింది. కారు, ఓపెన్ జిమ్ గోడ మధ్యల గాయత్రి చిక్కుకోవటంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే మణికొండలోని ఆవాస ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

చైనా మాంజా విక్రేత అరెస్ట్

దుండిగల్: నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. డి పోచంపల్లి, సర్వేనెంబర్ 120లో ఓ వ్యక్తి సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజాను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 సెట్ల మాంజాను సీజ్ చేశారు.

కొంపల్లి బీజేపీ అధ్యక్షుడిగా సతీష్‌సాగర్



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా పెద్దబుద్దల సతీష్‌సాగర్ నియమితులయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడిగా కొనసాగుతున్న జనార్ధన్ రెడ్డిని జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా పార్టీ అధిష్టానం నియమించింది. గతంలో బూత్ స్థాయి అధ్యక్షుడిగా పనిచేసిన సతీష్‌సాగర్ ప్రస్తుతం జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సతీష్‌సాగర్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తాను ఇన్నేళ్లుగా పడిన కష్టానికి తగిన గుర్తింపు లభించిందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదు టిప్పర్లు సీజ్

బంజారాహిల్స్: నిషేధిత వేళల్లో తిరుగుతున్న ఐదు టిప్పర్లను బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ వి.ప్రభాకర్‌రెడ్డి పట్టుకొని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఐదు టిప్పర్లను సీజ్ చేశారు. వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ట్రాఫిక్ పోలీసులకు రద్దీ సమయంలో నో ఎంట్రీ ఉండగా ఈ టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించి వీటిని నడుపుతున్న మునిచందర్, ఎం.నాగరాజు, ఎం.బాబు, వి.గిరిబాబు, ఎం.సంతోష్‌లపై కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరించిన డబుల్‌బెడ్రూమ్ లబ్ధిదారులు

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయంలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో బాచుపల్లి, నిజాంపేట్ డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఎమెల్యేను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అన్ని డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల సముదాయాల వద్ద అధికారులతో త్వరలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మౌలిక వసతులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులు ఇళ్లలోకి చేరుకునేలా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే బహదూర్‌పల్లి, డి పోచంపల్లి, దుండిగల్ డబుల్‌బెడ్రూమ్ ఇళ్లలోని లబ్ధిదారులకు అన్ని వసతులతో పాటు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. నిజాంపేట్ కార్పొరేటర్ బాలాజీ నాయక్ తదితరులున్నారు.

దూడూ.. పే.!

ఆన్‌లైన్ పేమెంట్ తీసుకుంటూ కనిపించిన దూడూ బసవన్న..



భోగి, సంక్రాంతిని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్‌లో సోమవారం ఉదయం దూడూ బసవన్నలు సందడి చేశారు. గంగిరెద్దులను ఆడించుకుంటూ దూడూ బసవన్నలు గల్లీ గల్లీ తిరిగాడు. గంగిరెద్దు కొమ్ములు మధ్య క్యూఆర్ కోడ్ పెట్టడంతో ప్రజలు ఆన్‌లైన్ పేమెంట్స్ చేశారు.

– జగద్గిరిగుట్ట

సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన వీసీ

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాలను వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహ, ఫార్మసీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ సునీతారెడ్డి, ఇతర బోధనా సిబ్బంది వీసీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ కళాశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, వసతి గృహాలు, భోజనశాలను పరిశీలించారు. కళాశాల అధ్యాపకులు గడియార స్తంభం, ఆడిటోరియం నిర్మాణం, ఫార్మసీ కళాశాల విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన వీసీ రిజిస్ట్రార్‌తో చర్చించి వాటిని అమలు చేయాలని ఆదేశించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి పి.గణేష్ మాదిగ, మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా పి.శంకర్‌మాదిగ, ఉపాధ్యక్షుడిగా డి.రవీందర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.పోచయ్య మాదిగ, కార్యదర్శిగా జి.రాజు మాదిగ, కోశాధికారిగా ఎల్.ఆనంద్‌మాదిగ, అధికార ప్రతినిధిగా వై.ప్రకాశ్‌మాదిగలను ఎన్నుకున్నారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా సి.యాదయ్య మాదిగ, ఆర్.నర్సింగ్‌రావుమాదిగ, డి.కృష్ణ మాదిగ, హెచ్.సుమన్ మాదిగలను ఎన్నుకున్నట్లు గణేష్‌మాదిగ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస చివరి రోజు పూజలు



జగద్గిరిగుట్ట కొండపపై ఉన్న గోవిందరాజ స్వామి తిరుకల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



జగద్గిరిగుట్ట: ధనుర్మాస చివరి రోజైన సోమవారం పలు ఆలయాలలో కల్యాణ మహోత్సవాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీగోవిందరాజస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం తిరుకల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో మొదలైన పూజలు అభిషేకం, ఆరాధన, పుణ్యవచనం, హారతి, హోమం, నైవేద్యం తదితర పూజలు చేశారు.

చింతల్ పద్మానగర్ ఫేజ్-1లో...

చింతల్, పద్మానగర్ ఫేజ్-1, శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..